క్లుప్తంగా

టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకూ టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్) ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల ఉన్నత పాఠశాలను ఆయన, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రణాళిక ప్రకారం చదివితే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, మెస్‌లోని భోజనం రుచి చూసి ఆదిలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకుల ఉన్నతపాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

కడియం: ప్రణాళికాబద్ధంగా చదివితే పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు వక్తలు సూచించారు. పరీక్షల నేపథ్యంలో కడియం హైస్కూల్లో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, ఉత్సాహభరిత వాతావరణంలో సిద్ధం కావాలన్నారు. బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదన్నారు. ఆరోగ్య జాగ్రత్తలను డైట్ లెక్చరర్ గంగాధర్ వివరించారు. ఎంఈవో లజపతిరాయ్, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు.

బీజేపీ సమావేశం

కడియం: బీజేపీ మండల శాఖ సమావేశం శుక్రవారం కడియంలో జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు విచ్చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు. మండల అధ్యక్షుడు కొటికలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు సందర్శన

కంబాలచెరువు: స్థానిక సెంట్రల్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. ఖైదీలకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆదేశాలను వారికి వివరించారు. ముద్దాయికి అవసరమైన ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, ఉచిత న్యాయ సహాయం పొందడం వారి హక్కు అన్నారు. అక్కడున్న వైద్య సదుపాయాలు, ఖైదీల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు తదితరులు ఉన్నారు.

రెండో రోజు శిక్షణ

కడియం: ఆధునిక యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు శుక్రవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. నామ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల డీన్ సీహెచ్ శ్యామ్ నాయక్ తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ముక్కంటి మురిసేలా..

- శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఆలయ కమిటీల పర్యవేక్షణ



పుష్కరాలరేవులో ఆధునీకరించిన గదులను పరిశీలిస్తున్న రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. శనిత్రయోదశి కూడా కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి, ఉమా మార్కండేయేశ్వరస్వామి, సారంగధరేశ్వరస్వామి, శృంగేరి జగద్గురు శంకర మఠం, శారద పీఠంలోని చంద్రమౌళేశ్వర స్ఫటిక లింగం, ఉమా రామలింగేశ్వర దేవాలయం, మహాకాళేశ్వరాలయంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే గోదావరి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో అన్ని ఘాట్లను సిద్ధం చేశారు.

వేడుకలకు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం టి.నగర్‌లోని బాలాత్రిపుర సుందరి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజాము నుంచి అభిషేకాలు, పూజలు, దర్శనాలు ప్రారంభమవుతాయి. బొమ్మూరులోని గౌరీచంద్రమౌళీశ్వర ఆలయంలో విశేష అభిషేకాలతో పాటు లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించనున్నారు. వెంకటనగరంలోని కాశీఅన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పూజలు జరుగుతాయి. తొర్రేడు, రాజవోలు, హుకుంపేట, కాతేరు, శాటిలైట్ సిటీ గ్రామాల్లోని శివాలయాలను ముస్తాబు చేశారు.

పుష్కరాలరేవు పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరి పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఆమె శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పుష్కరాలరేవులో రుడా ఆధ్వర్యంలో ఆధునీకరించిన మహిళలు దుస్తులు మార్చుకునే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో దుస్తులు మార్చుకునే గదులను ప్రారంభించలేమన్నారు. అయితే పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఘాట్‌కు వచ్చే మహిళా భక్తులు వాటిని వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుదే రఘు నరేష్, ఉమ్మడి వీరబాబు, డాక్టర్ కార్తిక్ సింగంపల్లి, ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాలా సత్యనారాయణ పాల్గొన్నారు.


సారంగధరేశ్వరస్వామి


మహాకాళేశ్వరస్వామి

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


హెల్మెట్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు

కంబాలచెరువు: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీఎస్పీ కేవీఎస్ఎస్ వరప్రసాద్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. స్థానిక రామాలయం సెంటర్ వద్ద తనిఖీలు చేసి.. హెల్మెట్ లేని వారిని గుర్తించి అవగాహన కల్పించారు. జిల్లాలో 2022లో 165 మంది రోడ్డు ప్రమాదాలలో తలకు గాయాలతో మరణించారన్నారు.

నిరంకుశ విధానాలపై పోరాడాలి

ప్రకాశం నగర్: పరిశ్రమల యాజమాన్యాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీరామ్ నగర్‌లోని బీటీఆర్ భవన్‌లో కార్మిక పోరాట యోధులు బీఎస్ బాలాజీ దాస్, బీబీ నాయుడు వర్ధంతి సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు సీఐటీయూ నాయకులు టీఎస్ ప్రకాష్, పోలిన వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డ్రోన్ వినియోగంతో సాగు సులభతరం

కడియం: సాగులో డ్రోన్ వినియోగించడం వల్ల పనులు సులభతరమవుతాయని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఎస్.మాధవరావు అన్నారు. కడియం ఆవలో రైతులకు శుక్రవారం వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాధవరావు మాట్లాడుతూ పురుగు మందు పిచికారీకి డ్రోన్‌ను వినియోగించడం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. కూలీలు, మందు, సమయం ఆదా అవుతుందన్నారు. అలాగే కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా యువతకు వీటిని ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. తద్వారా యువత కూడా ఉపాధి పొందవచ్చన్నారు. ఆస్ట్రేలియన్ టెక్నాలజీతో వచ్చిన అధునాతన డ్రోన్‌ను సంబంధిత కంపెనీ ప్రతినిధులు రైతులకు వివరించారు. అలాగే పంచగవ్యను వరి పొలంపై డ్రోన్‌తో పిచికారీ చేసి దాని పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఏవోలు కె.ద్వారకాదేవి, సురేష్, భీమరాజు పాల్గొన్నారు.


డ్రోన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ బైక్‌యాత్ర

హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం బయలుదేరిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానంతో వీరబాబు అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వరకూ బైక్‌యాత్ర చేపట్టాడు .ఈ నెల 6న ప్రారంభమైన ఈ యాత్ర శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా వీరబాబు తన బైక్‌యాత్ర విశేషాలను వివరించారు. ఆయనది తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోకవర్గంలోని తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం. 2009లో ఖమ్మంలోని వజీర్ సుల్తాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరాడు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా నాలుగేళ్ల(రూ.1.60 లక్షలు) బీటెక్ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ తనయుడు జగన్‌పై అభిమానంతో, ఆయన మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి బైక్ యాత్ర మొదలుపెట్టాడు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలకు రోజుకు సుమారు 100 నుంచి 120 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాడు. రాత్రి వేళ ఎక్కడికక్కడ లాడ్జిల్లో బసచేస్తూ వర్క్‌ఫ్రంహోమ్ కింద నైట్ షిఫ్ట్ పనిచేస్తున్నాడు. ఇప్పటివరకు సుమారు 2,125 కిలోమీటర్లు బైక్‌యాత్ర చేశాడు.


బైక్ యాత్ర చేస్తున్న వీరబాబు

నేడు మహా అన్నసమారాధన

- సుమారు 60 వేల మంది వస్తారని అంచనా
- కడియపులంకలో ముమ్మరంగా ఏర్పాట్లు


కడియపులంకలోని ఆంజనేయస్వామి

కడియం: కడియపులంకలోని పాత పువ్వుల మార్కెట్ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏటా మాదిరిగా ఈసారీ శివరాత్రి పర్వదినం రోజున భారీ అన్నదానానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమానికి 60 వేల మంది వరకు హాజరవుతారని అంచనా. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 300 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు. వంటకు 120 పొయ్యిలను వినియోగిస్తున్నారు. 30 వేల లీటర్ల సాంబారు తయారు చేయిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఇందుకోసం టన్నున్నర కందిపప్పు, కూరలు, సాంబార్‌కు రెండున్నర టన్నుల కూరగాయలు తీసుకువచ్చారు. బఫే విధానంలో వడ్డన చేసేందుకు 30 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. హైస్కూల్ గ్రౌండ్, చెరువు గట్టు, బృందావనం గెస్ట్‌హౌస్ ప్రాంగణం, పాత పువ్వుల మార్కెట్ ప్రాంగణాల్లో భోజనాలు పెట్టేందుకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ఉదయం నుంచే పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


అన్నసమారాధన కోసం తీసుకువచ్చిన కూరగాయలు

చక్రపాణి దంపతుల ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లోని సాయి భక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో శనివారం మహా అన్నసమారాధన జరుగుతుంది. వారు గత 27 ఏళ్లుగా ఏటా శివరాత్రి రోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 1990లో మోరంపూడి సెంటర్‌లో చిన్న స్వీటుస్టాల్ బండి ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి సాయిభక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ ఏర్పాటు చేశారు. 1995లో శివరాత్రి ముందురోజు చక్రపాణి వద్దకు సిరిపురపు బ్రహ్మయ్య అనే వ్యక్తి వచ్చి పండగ సందర్భంగా పులిహోర పంచిపెడుతున్నామని చెప్పారు. ఆక్షణంలోనే చక్రపాణికి మహాఅన్నసమారాధన చేయాలన్న ఆలోచన వచ్చింది. ఆ సంవత్సరం నుంచే మోరంపూడి సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం జరిగే అన్నసమారాధనకు మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 25 వేలమంది భక్తులు తరలివస్తారని అంచనా. సాయినాథుని కృపతోనే ఏటా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగలుగుతున్నామని వలవల చక్రపాణి దంపతులు తెలిపారు.


అన్నం తయారీకి సిద్ధం చేసిన గ్యాస్టౌవ్‌లు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్, అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అభివృద్ధి, పటిష్టత కోసం కష్టపడుతున్న ఎంపీ భరత్ రామ్‌ను చూసి ఆకర్షితులమై ఆ పార్టీలో చేరినట్లు జనసేనకు చెందిన బి.భరత్ కుమార్ (చెర్రీ) తెలిపారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో సుమారు 35 మంది జన సైనికులు, వీర మహిళలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఎంపీ భరత్‌రామ్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సాదరంగా ఆహ్వానించారు. భరత్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని 15వ డివిజన్ రెల్లిపేటలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని ఎంతో మంది ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. అదే ఎంపీ భరత్ దృష్టికి తీసుకువెళ్లగానే పరిష్కరించారని చెప్పారు. ఇదే విషయాన్ని తనతోపాటు ఉన్న జనసేన వీర మహిళలు, జన సైనికులకు చెప్పగానే అందరి ఏకాభిప్రాయంతో వైఎస్సార్ సీపీలో చేరామన్నారు.

సినిమాలు



శ్యామల	: అమిగోస్
సూర్యమినీ	: శ్రీదేవి శోభన్‌బాబు
సూర్యప్యాలెస్	: క్వాంటమేనియా
స్వామి	: వాల్తేరువీరయ్య
శివజ్యోతి	: సార్
అనుశ్రీ	: క్వాంటమేనియా
అశోక	: సార్
ఊర్వశి	: రైటర్ పద్మభూషణ్
రంభ	: క్వాంటమేనియా
మేనక	: వీరసింహారెడ్డి
గీతాఅప్సర	: వినరోభాగ్యము విష్ణుకథ
నామవరం	
వీఎస్ మహల్	: సార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అమిగోస్
కడియం	
వెంకటసూర్య	: వినరోభాగ్యము విష్ణుకథ

ఎంపీడీవో రత్నకుమారికి పుత్రవియోగం


ఎంపీడీఓ రత్నకుమారిని ఓదార్చుతున్న కలెక్టర్ మాధవీలత


సందీప్ (ఫైల్)

కడియం: ఎంపీడీవో కె.రత్నకుమారి కుమారుడు మట్టా సందీప్ (30) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సందీప్ ఇటీవలే గ్యాస్ట్రిక్ సంబంధిత అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. రత్నకుమారి కుమార్తె అమెరికాలో స్థిరపడ్డారు. సందీప్ మృతి వార్త తెలియడంతో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హుటాహుటీన ధవళేశ్వరం అఫీషియల్ కాలనీకి చేరుకుని సందీప్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్ తదితరులు రత్నకుమారిని పరామర్శించారు. అలాగే సందీప్ భౌతిక కాయానికి కలెక్టర్ మాధవీలత నివాళులర్పించారు. ఎంపీడీవో రత్నకుమారిని ఓదార్చారు.